ప్రజాశక్తి
గురువారం 18 డిసెంబర్ 2025
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి





పర్యాటకం ధరా భారం!



- నూతన ఆకర్షణలున్నా జేబుకు చిల్లుతో వెనకడుగు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ పర్యాటక రాజధానిగా విరాజిల్లుతున్న విశాఖపట్నంలో పర్యాటక రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. గ్లాస్ బ్రిడ్జ్ నుండి హెలికాప్టర్ మ్యూజియం వరకు సరికొత్త ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాయి. ఈ వినూత్న ప్రాజెక్టుల ఆకర్షణ ఒకవైపు ఉంటే, వాటి ధరలు సామాన్య పర్యాటకుల జేబుకు చిల్లు పెడుతుండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

కైలాసగిరిపై పర్యాటక శాఖ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్లాస్ బ్రిడ్జ్ పట్ల పర్యాటకులు మిశ్రమ స్పందన వ్యక్తం చేస్తున్నారు. ఆకాశంలో నడుస్తున్న అనుభూతిని కలిగించినప్పటికీ, దీని టికెట్ ధరలు సామాన్యులకు అందనంత ఎత్తులో ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక మధ్యతరగతి కుటుంబం ఈ బ్రిడ్జ్‌పై నడవాలంటే సుమారు రూ.800 (పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.150) ఖర్చు చేయాల్సి రావడంతో, చాలామంది దీనికి దూరంగా ఉండిపోతున్నారు. దీనికి తోడు భద్రతా పరమైన సందేహాల వల్ల కొందరు వెనకడుగు వేస్తున్నారు.

వెలవెలబోతున్న హిప్-హాప్ బస్సులు

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన హిప్-హాప్ బస్సుల పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు. నగర పర్యాటకుల కోసం మొత్తం మూడు బస్సులు ఏర్పాటుచేశారు. వాటిలో ఒకటి ఆర్‌కె.బీచ్ నుండి సింహాచలం వరకు, మరో రెండు ఆర్‌కె.బీచ్ నుండి తొట్లకొండకు నడుపుతున్నారు. వీటి టికెట్ ధర పెద్దలకు రూ.263, పిల్లలకు రూ.105గా నిర్ణయించి 24 గంటల పాటు చెల్లుబాటు అయ్యేలా నిర్ణయించారు. ఈ బస్సులకు వారాంతాల్లో 70 శాతం ఆక్యుపెన్సీ ఉంటున్నప్పటికీ, సాధారణ రోజుల్లో కేవలం 25 నుంచి 30 శాతం మంది మాత్రమే ఉంటోంది. ఒకే టికెట్‌తో రోజంతా ఏ బస్సులోనైనా ప్రయాణించవచ్చనే విషయంపై పర్యాటకులలో సరైన అవగాహన లేకపోవడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

ధరలు ఎక్కువ

గ్లాస్ బ్రిడ్జిపై విహారం ఆహ్లాదంగా ఉన్నప్పటికీ ధరలు ఎక్కువగా ఉన్నాయి. పెద్దలకు రూ.250, పిల్లలకు రూ. 150 చొప్పున వసూలు చేస్తున్నారు. దీన్ని తగ్గిస్తే బాగుంటుంది. భద్రతాపరంగా కొంత భయాందోళన ఉంది.



ఆర్.వరప్రసాద్
పర్యాటకుడు

మ్యూజియంమ్ హబ్.. ఆదరణ ఉన్నా అసంతృప్తి!

బీచ్ రోడ్డులోని రాజీవ్ స్మృతి భవన్ సమీపంలో టియు-142 యుద్ధ విమానం, సీ హారియర్, కొత్తగా వచ్చిన యు హెచ్ -3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియమ్‌లు ఒకే చోట ఉండటం పర్యాటకులకు కలిసొచ్చే అంశం. అయితే, ఒక్కో మ్యూజియానికి విడివిడిగా టికెట్లు తీసుకోవడం భారంగా మారుతోంది. కేవలం హెలికాప్టర్ చూసేందుకు రూ.100 వసూలు చేయడంపై పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టియు -142, సీ హారియర్, సబ్ మెరైన్ మ్యూజియమ్‌లకు కలిపి ఇచ్చే రూ.140 కాంబో టికెట్ పట్ల పర్యాటకులు సానుకూలంగా ఉన్నారు. ఇలాంటి కాంబో ఆఫర్లను గ్లాస్ బ్రిడ్జ్ ఇతర ప్రాంతాలకు కూడా

మిగతా 2లో..

చిరస్మరణీయం శారద సేవలు

- శ్రామిక ఉద్యమాల బలోపేతమే ఆమెకిచ్చే నివాళి
- వర్ధంతి సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం



శారద వర్ధంతి సభలో మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి- యంత్రాంగం విశాఖ కలెక్టరేట్ : శ్రామిక ఉద్యమాలను బలోపేతం చేయడమే శ్రామిక మహిళా ఉద్యమ నాయకులు డి.శారదకు ఇచ్చే మనమిచ్చే నిజమైన నివాళి అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అన్నారు. శారద 21వ వర్ధంతి సందర్భంగా బుధవారం జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించారు. శారద చిత్రపటానికి లోకనాథం, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, బిక్షావతి సుబ్బారావు దంపతుల కుమార్తె శారద విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటూ, సిఐటియు, సిపిఎం నాయకులుగా ఎదిగారన్నారు. శారద విశాఖ డెయిరీలో ఉద్యోగం చేసుకుంటూ, ఆ యూనియన్‌కు ప్రధాన కార్యదర్శిగా ఉండి అక్కడి అవకతవకలపై పెద్ద ఎత్తున పోరాడారన్నారు. విశాఖ జిల్లాలో శ్రామిక మహిళలను ఐక్యం చేయడంలోనూ, సంఘం ఏర్పాటు చేయడంలోనూ ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు. మొట్టమొదట జిల్లాలో అంగన్‌వాడీ యూనియన్ ఏర్పాటులో ఎంతో కృషి చేశారని తెలిపారు. సిఐటియులో నేడు శ్రామిక మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారంటే దానికి కారణం శారద అని కొనియాడారు. శారద మరణం కార్మిక ఉద్యమానికి, ముఖ్యంగా శ్రామిక మహిళల ఉద్యమానికి తీరని లోటు అన్నారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడడం మన ముందున్న కర్తవ్యం అన్నారు. శ్రామిక మహిళలను ఐక్యం చేసి పోరాటాలలో భాగస్వాములు చేయడం ద్వారా ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని, విశాలమైన శ్రామిక ఉద్యమాలను నిర్మించడమే శారదకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జి సిఎమ్‌డిగా మనీష్‌రాజ్‌గుప్తా
వార్త మెయిన్‌లో..

'వినరా ఓ వేమ' చిత్ర యూనిట్ సందడి
వార్త 4లో..

టెట్ పరీక్షకు 91.36 శాతం హాజరు
వార్త 2లో..

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం
వార్త 6లో..



గాజువాకలో కళాప్రదర్శనలిస్తున్న చిన్నారులు

అలరించిన శ్రామిక కళా సంబరాలు

వార్త 8లో..

బారైట్ నిల్వలు తగ్గడం ఇంధన భద్రతకు ముప్పు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నియంత్రణలేని ఎగుమతుల కారణంగా భారత్‌లో అందుబాటులో ఉన్న బారైట్ నిల్వలు 10 సంవత్సరాల కన్నా తక్కువగా మిగిలాయని, దీని వల్ల భారత్‌కు దీర్ఘకాలిక ఇందన భద్రతకు ముప్పు కలగనుందని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ, బారైట్ నిల్వల తగ్గుదల కేవలం ఖనిజ సమస్య మాత్రమే కాదని, ఇది జాతీయ ఇంధన భద్రత సమస్య అన్నారు. భారత్ తన ముడి చమురు అవసరాలలో 90 శాతం దిగుమతులపై ఆధారపడుతుందన్నారు. దేశీయ నిల్వలను అన్వేషించి వెలికి తీయగల సామర్థ్యమే కీలకం అన్నారు. భవిష్యత్తులో భారత్ సురక్షితంగా, సమర్థవంతంగా డ్రిల్లింగ్ చేయగలరా లేదా అనేది బారైట్ మీదే ఆధారపడి ఉందని తెలిపారు. ఈ వనరుల సంరక్షణ వ్యూహాత్మక ప్రాధాన్యతగా మారాలన్నారు. సి-డిఇపి నివేదిక ఇదే అంశాన్ని పేర్కొందని వివరించారు.

విఆర్ సిల్క్స్ ప్రారంభంలో.. యాంకర్ శ్రీముఖి సందడి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్/ ఎంవిపి.కాలనీ : ఆధునిక, సంప్రదాయ వస్త్రాల నిలయం విఆర్ స్కిల్క్స్ షాపింగ్ మాల్‌ను ప్రముఖ యాంకర్ శ్రీముఖి బుధవారం ప్రారంభించారు. షాపింగ్ మాల్‌లో ఆమె కలియ తిరిగారు. అనంతరం వెలుపలకు వచ్చి అభిమానులకు అభివాదం చేశారు. హాయ్ వైజాగ్ అంటూ అభిమానులను ఉత్సాహపరిచారు. విశాఖపట్నం అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నాణ్యతతో కూడిన దుస్తులను అతి తక్కువ ధరకు అందిస్తూ, కస్టమర్ల ఆదరాభిమానాలు చూరగొనాలన్నారు. ఈ సందర్భంగా విఆర్ సిల్క్స్ ఎమ్‌డి ఎ.రాణి మాట్లాడుతూ డిజైనర్ శారీస్‌తో మీ ముందుకు వచ్చామన్నారు. కంచి, ధర్మవరం, బనారస్‌కు చెందిన స్వచ్ఛమైన చేనేత చీరలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక డిస్కౌంట్ ఆఫర్లు ఉన్నాయన్నారు. డ్రెస్ మెటీరియల్ ఒకటి కొంటే మూడు, పట్టు చీరలు ఒకటి కొంటే రెండు పొందే ఆఫర్ ఉన్నట్లు వివరించారు. పట్టు చీరలపై 70, 60, 50 శాతం డిస్కౌంట్ ఆఫర్లు ఉన్నాయన్నారు.



మాట్లాడుతున్న యాంకర్ శ్రీముఖి

మొదటి పేజీ తరువాయి..

పర్యాటకం ధరా భారం

విస్తరించాలని పర్యాటకులు కోరుతున్నారు.

ప్రచారం పెరగాలి.. ధరలు తగ్గాలి..

విశాఖ పర్యాటక రంగం ప్రపంచస్థాయికి చేరాలంటే కేవలం ప్రాజెక్టులు ఉంటే సరిపోదు. అవి సామాన్యుడికి అందుబాటులో ఉండాలి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, గ్లాస్ బ్రిడ్జ్ ధరలను తగ్గించాలని, హిప్-హాప్ బస్సుల ప్రయోజనాలపై పర్యాటక కేంద్రాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని, అన్ని పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ఒకే 'మాస్టర్ టికెట్' ప్రవేశపెట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.



శారద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా సభ్యులు

చిరస్మరణీయం శారద సేవలు

ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఉపాధ్యక్షులు పి.మణి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.గంగారావు, వైరాజు, ఎం.సూరీడు, రమణ, చందశేఖర్, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : శ్రామిక మహిళా నాయకులు కామ్రేడ్ డి.శారద 21వ వర్ధంతి కశింకోటలో బుధవారం అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నిర్వహించారు. శారద చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా అనకాపల్లి జిల్లా కార్యదర్శి డిడి వరలక్ష్మి మాట్లాడుతూ శారద ఉత్తమ లక్ష్యం, ఉన్నతమైన ఆశయం, ఖచ్చితమైన మార్గ నిర్దేశికత్వం కలిగిన పోరాట యోధురాలు అని కొనియాడారు. కార్యక్రమంలో బి.సూర్యలక్ష్మి, బి.అచ్చమ్మ, ఏ.నూకరత్నం, ఏ.నూకాలమ్మ, కె.పూర్ణమ్మ, డి.నాగమణి, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికుల గుర్తింపు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : డిఎల్ఎస్ఎ, వివాహ ముక్తభారత్, స్టేట్ యాక్షన్ చైల్డ్ లేబర్, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ ఆధ్వర్యాన బుధవారం పూర్ణామార్కెట్, ఆర్‌కె.బీచ్, ఎంవిపి కాలనీ ప్రాంతాలలో షాపులను తనిఖీ చేస్తూ బాల కార్మికులను గుర్తించారు. బాల కార్మికుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్న వయసులో పెళ్లిళ్లు జరగడం వల్ల జరిగే అనర్థాలను కూడా వివరించారు. 18 సంవత్సరాలలోపు వివాహం చేస్తే జరిగే అనర్థాలు, రక్తహీనత, ఆరోగ్యం క్షీణించడం, త్వరగా ముసలితనం రావడం జరుగుతుందని వివరించారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పేర్ల భాస్కరరావు, అబ్దుల్ మునీర్, భవాని, సత్యనారాయణ, విద్యాశాఖ సిబ్బంది గణపతి శ్రీనివాసరావు, శిశు సంక్షేమ శాఖ ప్రతినిధి లీలావతి, అరుణ్ కుమార్, జయశ్రీ పాల్గొన్నారు.

సైనిక సంక్షేమంలో భాగస్వామ్యం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సైనిక సంక్షేమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి వింగ్ కమాండర్ పి.చంద్రశేఖర్ (రిటైర్డ్) పిలుపునిచ్చారు. దేశం కోసం అహర్నిశలు పనిచేస్తున్న సైనికులు, వారి కుటుంబాల కోసం ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. విశాఖ పోర్టు పాఠశాల పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం (సాలగ్రామపురం) జిల్లా సైనిక సంక్షేమ నిధికి రూ.5,500 విరాళంగా అందజేసింది. సంఘం అధ్యక్షుడు ఎన్.నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి జి.రమణబాబు బుధవారం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణారావు, అసిస్టెంట్ శ్రవణ్ పాల్గొన్నారు.

భీమ్ యుపిఐ ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భీమ్ పేమెంట్స్ యాప్ కొత్త వినియోగదారులను డిజిటల్ చెల్లింపుల వైపు ప్రోత్సహించేందుకు 'గర్వ్ సే స్వదేశీ' క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నట్టు సంస్థ సిఇఒ లలితా నటరాజ్ తెలిపారు. సిరిపురంలోని ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ నెల చివర్లో భీమ్ తన 10వ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్న సందర్భంగా తొలిసారి యాప్‌ను ఉపయోగించే వారికి ప్రత్యేక ఆఫర్‌ను అందిస్తున్నామని చెప్పారు. కొత్త వినియోగదారులు రూ.20 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీపై ఫ్లాట్ రూ.20 క్యాష్‌బ్యాక్ పొందవచ్చని తెలిపారు.

19 నుండి క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎంవిపి కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో ఈనెల 19, 20, 21 తేదీల్లో 11వ క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పోను నిర్వహించనున్నట్లు క్రెడాయి విశాఖపట్నం చాప్టర్ అధ్యక్షులు ఇ.అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం ఒక హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ప్రాపర్టీ ఎక్స్ పో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఎక్స్‌పోలో 71 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, సందర్శకులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. స్థలాలు, అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ఇళ్లు కొనుగోలు దారులకు బ్యాంకులు రుణాలు ఇచ్చే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రత్యేకంగా ఒక స్టాల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎయు ఆర్కియాలజీ విభాగం అపోలో, గీతం, విఎంఆర్‌డిఎ వంటి సంస్థలు స్టాల్స్ ఏర్పాటుకు ముందుకు వచ్చాయని చెప్పారు. ఈ ప్రాపర్టీ ఎక్స్‌పోను విశాఖ ప్రాంత ప్రజలు సందర్శించి ప్రోత్సాహించాలని కోరారు. విశాఖపట్నం క్రెడాయి చాప్టర్ చైర్మన్ వి.ధర్మేంద్ర మాట్లాడుతూ, ప్రాపర్టీ ఎక్స్‌పోను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో విశాఖపట్నం చాప్టర్ సెక్రటరీ వి.శ్రీను, ఎక్స్ పో కన్వీనర్ గోవిందరాజులు పాల్గొన్నారు.



ప్రాపర్టీ ఎక్స్‌పో పోస్టర్‌ను విడుదలచేస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

శివశంకర్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి-రావికమతం: ఇటీవల ఉమ్మడి విశాఖపట్నం జిల్లా టెలికం అడ్వైజర్ కమిటీ సభ్యునిగా ఎన్నికైన గల్లా రాజేశ్వరరావు, చోడవరం నియోజకవర్గం వికలాంగుల హక్కుల సాధన కమిటీ కన్వీనర్ గెంజి శ్రీనివాస్ తదితరులు ఆంధ్ర ప్రదేశ్ ఎంఎస్ఎంఇ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివ శంకర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో తలాటం సూరిబాబు, శ్రీను, గుడివాడ మాజీ సర్పంచ్ పలువురు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-పాయకరావుపేట: మండలంలోని గోపాల పట్నం జెడ్పీ హైస్కూల్లో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అంగన్వాడి సూపర్వైజర్ షేక్ రంజాన్ బీబీ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల పిల్లల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు పడతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులతో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు.

గంటాను కలిసిన పట్టాభి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా టిడిపి అధ్యక్షునిగా నియమితులవుతారనే ఊహాగానాల నేపథ్యంలో చోడే పట్టాభిరామ్ బుధవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఎంవిపి.కాలనీలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టాభిని గంటా శాలువా కప్పి సత్కరించారు. పార్టీని మరింత పటిష్టం చేసి, జివిఎంసి ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించాలని గంటా సూచించారు. పట్టాభి గతంలో కార్పొరేటర్‌గా, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.

గోపాలపట్నం : గోపాలపట్నంలోని పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలో గణబాబును పట్టాభి మర్యాదపూర్వకంగా కలిశారు.

సన్ క్యాంపస్‌లో ప్రీ-క్రిస్మస్ వేడుకలు


కేక్ మిక్సింగ్‌లో పాల్గొన్న అతిథులు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : సన్ ఇంటర్నేషనల్ బీచ్ క్యాంపస్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలును బుధవారం ఘనంగా నిర్వహించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సతీమణి గంటా శారద ముఖ్య అతిథిగా హాజరై సన్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తితో కలిసి కేక్ మిక్సింగ్ ప్రక్రియను ప్రారంభించారు. సుమారు 50 కేజీల భారీ కేక్ మిశ్రమాన్ని తయారు చేసేందుకు విద్యార్థులు ఉత్సాహంగా పోటీ పడ్డారు. వివిధ రకాల డ్రై ఫ్రూట్స్, నట్స్, వైన్, జిన్, విస్కీలను కలిపి సంప్రదాయ పద్ధతిలో కేక్ మిక్సింగ్ చేశారు. విద్యార్థులు ద్రాక్ష పండ్లను తొక్కుతూ (గ్రేప్స్ స్టాంపింగ్) సందడి చేశారు. ఈ సందర్భంగా గంటా శారద మాట్లాడుతూ, పండుగలు మనుషుల మధ్య దూరాన్ని తగ్గించి మమేకం చేస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ పరమత సహనాన్ని పాటిస్తూ, పండుగలను గౌరవించుకోవాలని సూచించారు. సన్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తి మాట్లాడుతూ, క్రిస్మస్ అంటేనే ప్రేమ, శాంతిని పంచడమని చెప్పారు. ఈ భారీ కేక్‌ను తయారుచేసిన అనంతరం నగరంలోని అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాడిసన్ బ్లూ జిఎం అభిషేక్ పాణి, హెచ్‌ఆర్ రత్నాకర్, ఎగ్జిక్యూటివ్ చెఫ్ రమేష్, రాజ్ కిరణ్, నొవాటెల్ హెచ్‌ఆర్ నిషా బట్వాని, ఎగ్జిక్యూటివ్ చెఫ్ సౌరబ్ చౌదరి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో 'సమత'కు బంగారు పతకాలు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : విశాఖలో నిర్వహించిన ఎయు అంతర కళాశాల అథ్లెటిక్స్ పోటీలలో సమత కళాశాల బి.కాం తృతీయ సంవత్సరం విద్యార్థి చల్లా సురేష్ 1500, 800 మీటర్ల అథ్లెటిక్స్‌లో బంగారు పతకం సాధించారు. బిబిఎ ప్రథమ సంవత్సర విద్యార్థి హిమతేజ్ 110 మీటర్ల హడిల్స్ విభాగంలో సిల్వర్ పతకం సాధించారు. తమ విద్యార్థులు బంగారు పతకం సాధించడం గర్వ కారణమని కళాశాల డీన్ అండ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ ఎస్.విజయరవీంద్ర పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు పీడీ జి.రామకృష్ణ, హెచ్‌ఒడిలు వి.అనిత, హెచ్‌ఒడి ఎవి.కోటేశ్వరరావు అభినందించారు.

విశాఖ మార్కెట్‌లో మోటరోలా ఎడ్జ్ 70 విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : మోటరోలా భారతదేశంలో తన అత్యంత సన్నని స్మార్ట్‌ఫోన్ మోటరోలా ఎడ్జ్ 70ను మోటరోలా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ టిఎం. నరసింహన్ విశాఖలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది కేవలం 5.99 ఎంఎం మందం, 159 గ్రాముల బరువుతో ఎయిర్‌క్రాఫ్ట్-గ్రేడ్ అల్యూమినియం డిజైన్‌ను కలిగి ఉందని తెలిపారు. ఇందులో అన్ని లెన్స్‌లలో 4కె 60ఎఫ్ పిఎస్ రికార్డింగ్‌తో కూడిన ట్రిపుల్ 50 ఎంపి ఎఐ కెమెరాలు ఉన్నాయని వివరించారు. 5000ఎంఎహెచ్ బ్యాటరీ 40 గంటల వరకు బ్యాటరీ లైఫ్‌ను, వేగవంతమైన వైర్డ్, వైర్‌లెస్ ఛార్జింగ్‌ను అందిస్తుందని తెలిపారు స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 ద్వారా ఆధారితమై, మోటో ఎఐ 2.0, కోపైలట్, గూగుల్ జెమిని వంటి మల్టీ-ప్లాట్‌ఫామ్ ఎఐ స్వేచ్ఛను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ అల్ట్రాథిన్ ఫోన్ రూ.28,999 ప్రారంభ ధరతో శక్తివంతమైన ఫీచర్లను అందిస్తోందని తెలిపారు.

పేద బాలికల విద్యకు ఒయాసిస్ ఫెర్టిలిటీ చేయూత

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రముఖ సంతాన సాఫల్య కేంద్రం ఒయాసిస్ ఫెర్టిలిటీ సామాజిక బాధ్యతలో భాగంగా మరో ముందడుగు వేసింది. కెసి.మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్, నాందీ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రాజెక్ట్ 'నన్హీ కలీ'తో భాగస్వామ్యం కుదుర్చుకుని, 100 మంది నిరుపేద బాలికల విద్యా బాధ్యతను స్వీకరించినట్లు సంస్థ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా జి రావు తెలిపారు. ఓయాసిస్ ఫెర్టిలిటీ విశాఖ నుండి ప్రారంభించిన 'హ్యాపీ న్యూ ఫ్యామిలీ' ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దుర్గా జి రావు మాట్లాడుతూ, విద్య ద్వారానే బాలికలకు సాధికారత లభిస్తుందని, వారికి ఉజ్వల భవిష్యత్తును అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎంపికైన బాలికల విద్యా సంవత్సరం పూర్తి ఖర్చులను ఒయాసిస్ ఫెర్టిలిటీ భరిస్తుందని తెలిపారు. విద్యార్థినులకు డిజిటల్ లెర్నింగ్, లైఫ్ స్కిల్స్, క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి బాలికకు బ్యాగ్, బూట్లు, స్టేషనరీ, శానిటరీ ప్యాడ్‌లతో కూడిన 'నన్హీ కలీ కిట్'ను అందజేస్తామని వివరించారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి వైద్య సేవలతో పాటు ఇలాంటి సామాజిక కార్యక్రమాలు ఎంతో అవసరమని సంస్థ సిఇఒ పుష్కరాజ్ షెనాయ్ వివరించారు. ఈ కార్యక్రమంలో నన్హీకలీ ప్రతినిధులు, ఒయాసిస్ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల వేషధారణలు

ప్రజాశక్తి-తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు ఇన్‌క్రెడిబుల్ స్కూల్లో ఫ్యాషన్ పరేడ్ లిటిల్ వాయిస్, బిగ్ డ్రీమ్ స్లోగన్ కార్యక్రమం నిర్వహించారు కరస్పాండెంట్ బోగేల కృష్ణ మాట్లాడుతూ కార్పొరేట్ స్కూల్స్ దీటుగా అతి తక్కువ ఫీజులతో ఉన్నత ప్రమాణాలతో వినూత్న పద్ధతిలో యాక్టివిటీ విధానంలో తమ పాఠశాలలో విద్యాబోధన సాగిస్తున్నామరిచ చిన్నారులకు ఇన్సిరేషన్‌కు, స్టేజ్ ఫియర్ పోయి ం స్వచ్ఛందంగా మాట్లాడే విధానం అలవాటు చేశారు. చిన్నారుల డాక్టర్, పోలీస్, ఆర్మీ, నేవీ, రైతులు, ఉపాధ్యాయుల వేషధారణలు అలరించాయి. ఆకర్షనీయ వేషధారణకు కరస్పాండెంట్ భోగేల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రసి సతీష్, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బండారు సౌజన్య పుష్పలత పాల్గొన్నారు

నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రినాథ శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం విశాఖపట్నం సుజాత నగర్‌కు చెందిన రంగా మహాలక్ష్మి కుమారి రూ. లక్ష విరాళంగా సమర్పించారు. ప్రోటోకాల్ ఆఫీసులో డొనేషన్ కౌంటర్లో విరాళాన్ని నగదు రూపంలో అందజేసి రశీదు పొందారు.విరాళానికి సంబంధించి బాండ్‌ను దాతకు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు స్వయంగా అందజేశారు. విరాళదాతకు ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ మండపంలో వేద ఆశీర్వచనం అందించగా, దాతను ఆలయ అధికారులు శేష వస్త్రంతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని పెద్దిపాలెం అప్పన్న కాలనీలో భీమిలి ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా బుధవారం హెచ్‌ఐవి ఎయిడ్స్‌పై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీను మాట్లాడుతూ, సరైన అవగాహన, జాగ్రత్తలతో ఎయిడ్స్‌వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు.

విశాఖ ప్రగతికి అమెరికన్ సంస్థల భారీ పెట్టుబడులు

గీతం వర్సిటీలో యుఎస్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్

ప్రజాశక్తి-మధురవాడ : భారత్ అమెరికా దేశాల మధ్య మెరుగైన వాణిజ్య సంబంధాలు నెలకొని ఉన్నాయని, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖప్రాంతంలో అమెరికన్ కంపెనీలు గూగుల్, అమెజాన్ వంటి సంస్థలు భారీ పెట్టుబడులతో ముందుకు రావడం విశాఖ ప్రగతికి సూచిక వంటిదని యుఎస్. కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్ అన్నారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా అమెరికన్ తెలుగు అసోసియేషన్ నిర్వహించిన వాణిజ్య సదస్సులో మాట్లాడుతూ, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని కొత్తతరం పారిశ్రామిక వేత్తలు తయారుకావాలన్నారు. ఉన్నత విద్యకోసమే కాకుండా వ్యాపార విస్తరణకు తెలుగు ప్రజలు అమెరికాను గమ్యస్థానంగా ఎంచుకోవడం అభినందనీయ మన్నారు. గీతం వంటి విద్యా సంస్థలు అమెరికన్ వర్సిటీలతో భాగస్వామ్య ఒప్పందాలు చేసుకోవడం భవిష్యత్తులో మంచి ఫలితాలను ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్వాంటం కంప్యూటింగ్ వంటి వ్యూహాత్మక సాంకేతిక రంగాల్లో భారత్,అమెరికా సహకారాన్ని ప్రస్తావిస్తూ, 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటు కోసం ఆంధ్రప్రదేశ్ రూపొందించిన దూరదృష్టిని ప్రశంసించారు. విద్యా రంగం, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాల ద్వారా ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయన్నారు. అమెరికన్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్ చల్లా మాట్లాడుతూ, అమెరికాలో తెలుగు జనాభా 3.2 లక్షల నుంచి 12.3 లక్షలకు పెరిగిందని, దీంతో తెలుగును అమెరికాలో 11వ అత్యధికంగా మాట్లాడే విదేశీ భాషగా, భారతీయ భాషల్లో మూడవ స్థానంలో నిలిచిందని తెలిపారు. తెలుగు ప్రజల పెట్టుబడులు ప్రస్తుతం 215 బిలియన్ డాలర్లుగా ఉండగా, వాటిని 500 బిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో తమ అసోసియేషన్ పనిచేస్తోందన్నారు. అమెరికన్ తెలుగు అసోసియేషన్ నూతన అధ్యక్షుడు సతీష్‌రెడ్డి మాట్లాడుతూ, విశాఖపట్నం ప్రాంతంలో కృత్రిమ మేధ, డేటా సెంటర్ల అభివృద్ధి కొత్త స్టార్టప్‌లకు దారితీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువ పారిశ్రామికవేత్తలు గ్లోబల్ కనెక్టివిటీ కోసం అమెరికాలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.



గీతం వర్సిటీ సందర్శనలో లారా విలియమ్స్

ఇండో అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు బి. ప్రభాకరరావు మాట్లాడుతూ, పెట్టుబడిదారులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ సరైన దిశలో ముందుకెళ్తోందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ అంతర్జాతీయ వ్యాపార విభాగం అధ్యాపకురాలు డాక్టర్ రాధా రఘురామ పాత్రుని మాట్లాడుతూ, అమెరికాతో రాష్ట్రానికి సముద్రాహారం, ఫార్మా వ్యవసాయ ఉత్పత్తుల రంగాల్లో బలమైన వాణిజ్య సంబంధాలు ఉన్నాయని, అలాగే విలువ ఆధారిత ఆహార ప్రాసెసింగ్, పునరుత్పాదక ఇంధనం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయన్నారు. ఇమాజినోవేట్ వ్యవస్థాపకుడు వి.కృష్ణ మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత యువతకు కొత్త పారిశ్రామిక అవకాశాలను సృష్టిస్తుందన్నారు. సెమినార్‌లో వివిధ పరిశ్రమల ప్రతినిధులు, వ్యాపార నిపుణులు పరస్పర చర్చల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని పరిశోధన కేంద్రాలు, డేటా సెంటర్ సహ పలు విభాగాలను యు.ఎస్. కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్, అమెరికన్ తెలుగు అసోసియేషన్ సభ్యులు సందర్శించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, గీతం మూర్తి ప్రయోగ శాలల పర్యవేక్షక అధికారి డాక్టర్ గురజాడ రవికుమార్ పాల్గొన్నారు.

చట్ట సవరణతో 'ఉపాధి' దూరం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- సీతమ్మధార/ కలెక్టరేట్ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) బిల్లు, 2025ను తీసుకురావాలన్న కేంద్రప్రభుత్వ ప్రయత్నాలను డివైఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, మహేష్ తెలిపారు. తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి చట్టాన్ని ఇప్పటికే నిధుల లేమితో పరిమిత స్థాయికి కుదించేసిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, ఇపుడు చట్టాన్ని కాస్తా బిల్లుగా మార్పుతో కొద్దిపాటి ఉపాధిని కూడా దూరం చేసే చర్యలకు ఉపక్రమించడం దుర్మార్గమన్నారు. ఈ పథకం కింద లక్షలాది మందికి ఉపాధి కల్పించినట్లు ప్రభుత్వ గణాంకాల ద్వారా తెలుస్తోందని, .ఈ దశలో ఈ చట్టం స్థానంలో వేరే బిల్లు తీసుకొస్తే, గ్రామీణ యువత, కార్మికుల జీవనోపాధి మరింత దెబ్బతింటుందని, తద్వారా వారు మరింత పేదరికంలోకి నెట్టబడతారని ఆవేదన వ్యక్తంచేశారు.కొత్తగా తీసుకువస్తున్న ప్రతిపాదిత బిల్లు ద్వారా చట్టబద్ధంగా ఉన్న ఉపాధి హక్కును నిరుగార్చాలని కేంద్రం చూస్తోందని,ఈ పరిస్థితుల్లో తక్షణమే కొత్త బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.. గ్రామీణ ఉపాధి హామీ చట్టం కాపాడేందుకు ఇతర ప్రజాస్వామ్య సంఘాలతోకలిసి పోరాడతామని స్పష్టం చేశారు.

హాకీ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి -సీతమ్మధార:యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఏయు అంతర్ కళాశాలల హాకీ పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు సత్తా చాటి, ద్వితీయ స్థానంలో నిలిచారు. రన్నరప్‌గా నిలిచిన హాకీ జట్టు క్రీడాకారులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ, మరమ్మతుల దృష్ట్యా ఈనెల 18న గురువారంఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2. గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం ఎఇఇ మండల అప్పల నాయుడు తెలిపారు ఆనందపురం, వేముల వలస, ఎల్‌వి.పాలెం బిపి కల్లాలు, పొడుగు పాలెం, కుసులవాడ, జగన్నాథపురం, వెంకటపురం, చందక, గొట్టిపల్లి, చిన్నయ్యపాలెం, రామునాయనిపేట, రేగాని గూడెం, ముకుంద పురం కాలని, దుక్కవాని పాలెం, మెట్టమెదపాలెం, పాలవలస, తర్లువాడ, గుడిలోవ, నగరంపాలెం, పందలపాక, బాకూరు పాలెం, ఇచ్ఛాపురంలో విద్యుత్ ఉండదన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని దుక్కవానిపాలెం సమీపంలో కెజిఆర్ గౌతమ్ పాఠశాల ఎదురుగా జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. వివరాలివి. కూర్మన్నపాలెం వడ్లపూడి లక్ష్మీపురం కాలనీకి చెందిన మల్లా అచ్యుత భారతి (50) బుధారం ఉదయం దుక్కవానిపాలెం సమీపంలో ఉన్న కెజిఆర్ గౌతమ్ పాఠశాలకు తన అక్క కూతురిని చూడటానికి వచ్చింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పాఠశాల నుంచి బయలుదేరి కాలినడకన జాతీయ రహదారిని దాటుతున్న సమయంలో ఆనందపురం నుంచి పెందుర్తి వైపు అతివేగంగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. అయితే వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతురాలి భర్త మల్లా లక్ష్మీజీ ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు బైక్‌ను ఢీకొట్టిన కారు - కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విధి నిర్వహణలో భాగంగా ఆరిలోవ పోలీసులు ప్రయాణిస్తున్న బైక్‌ను కారు అతివేగంగా ఢీకొట్టింది. దీనితో పోలీసు కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు కాగా ఎస్ఐకు స్వల్పగాయాలతో బయటపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిలోవ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ హరికృష్ణ, కానిస్టేబుల్ వీరేంద్రతో కలిసి దారపాలెంలో ఒక కేసుపై మంగళవారం రాత్రి ధారపాలెం వెళ్లారు. తిరిగి బైక్‌పై వస్తుండగా అతివేగంగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఎస్ఐ హరికృష్ణకు స్వల్పగాయాలు కాగా, కానిస్టేబుల్ వీరేంద్రకు తీవ్రగాయాలయ్యాయి.

పోలీసు అధికారిగా నమ్మించి బైక్ చోరీ నిందితునికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : పోలీసు అధికారిగా నమ్మబలికి మోసగించడంతోపాటు బైక్ చోరీ కేసులో వంతల వెంకట రామన్ అనే నిందితునికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.పది వేలు జరిమానా విధిస్తూ ప్రధాన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎం. ప్రదీప్ కుమార్ బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకపోతే 3 నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. . సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ తెలిపిన వివరాలివి.

గతేడాది అక్టోబర్ 20న బీచ్‌రోడ్డు తెన్నేటి పార్కులో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న నిందితుడు పోలీస్ అధికారిగా నమ్మించి బైక్ తీసుకెళ్లి తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుడు ఈమలపల్లి అప్పారావు ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్ఐ వై.కృష్ణ దర్యాప్తు చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి ఈ మేరకు తీర్పునిచ్చారు. కాగా నిందితుడిపై విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో ఏడు కంటే ఎక్కువ కేసులు ఉన్నట్లు వెల్లడించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి దాడిలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి- మాడుగుల:మాడుగులలో మతిస్థి మితం లేని వ్యక్తి బుధవారం పలువురుపై కర్రతో దాడి చేశాడు. ఈ దాడిలో గొర్లి నారాయణమ్మ, చెయ్యి విరిగిపోయింది. బాలిబోయిన కొండాజీ తలపై స్వల్పగాయాలతో బయటపడ్డాడు. వీరికి సీహెచ్‌సీలో వైద్య సేవలు అందించారు. దీంతో గ్రామస్తులు భయాందోళనలకు గురయ్యారు. స్థానికులు వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే మతిస్థిమితం లేని ఆయను అదుపులోకి తీసు కొన్నారని గ్రామప్రజలు తెలిపారు. ఈ విషయంపై ఎస్సై నారాయణరావును అడగ్గా దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి మానసిక ఆసుపత్రికి తరలిస్తామన్నారు.

20న మండల సమావేశం

ప్రజాశక్తి-పద్మనాభం. : ఈనెల 20న మండల సాధారణ సర్వ సభ్యుల సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో వి నగేష్ బుధవారం తెలిపారు ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు

తోపుడుబండ్లను తొలగిస్తే ఊరుకోం

ప్రజాశక్తి -గాజువాక : తోపుడు బళ్లను తొలగిస్తే చూస్తూ ఊరుకోబోమని, సిఐటియు నాయకులు నమ్మి రమణ అన్నారు. పెదగంట్యాడలో తోపుడుబండ్లను తొలగించాలని జివిఎంసి అధికారులు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో కోర్ట్ ఆర్డర్‌ను పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 30 ఏళ్లుగా పెదగంట్యాడ జంక్షన్లో తోపుడు బళ్లవ్యాపారంలో జీవనం సాగిస్తున్నారన్నారు.

గతంలోనూ చిరువ్యాపారాల తొలగింపుపై 2017లో కోర్టును ఆశ్రయించగా,ఉపాధి కల్పించకుండా తొలగించరాదని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు.కోర్టు ఆర్డర్ ప్రతులను జివిఎంసి అధికారులకు ఇచ్చినా, తొలగించాల్సిందేనని భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. తోపుడు బండ్ల వర్తక సంఘం నాయకులు కెవి రమణ మాట్లాడుతూ, దీనిపై స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.స్థానిక సిఐటియు నాయకులు గణిత అప్పలరాజు మాట్లాడుతూ, కోర్డు ఆదేశాల మేరకు ఉపాధి కల్పించకుండా తోపుడు బళ్లను తొలగించడం సరికాదని హెచ్చరించారు. నిరసనలో పాల వెంకయ్య, తోపుడు బండ్లు వర్తకులు పాల్గొన్నారు.


కోర్టు ఉత్తర్వులను చూపుతున్న తోపుడుబండ్ల వర్తకులు

వినరా ఓ వేమ చిత్రయూనిట్ సందడి


అవంతి కళాశాలలో సందడి చేస్తున్న సినిమా యూనిట్

ప్రజాశక్తి -తగరపువలస: స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో 'వినరా ఓ వేమ' సినిమా యూనిట్ బుధవారం సందడి చేసింది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను విద్యార్థులతో ముచ్చటించారు. సినిమా మంచి సందేశంతో కూడుకున్నదని, అందరికీ నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమాలోని . కొన్ని సన్నివేశాలను విద్యార్థులకు వివరించిన దర్శకుడు రాజు మద్దెల, చిత్రంలో హీరో పల్సర్ బైక్ రమణ, ప్రశాంత్ కల్యాణ్ అద్భుతంగా నటించారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. మురళీకృష్ణ, . డైరెక్టర్ చంద్రశేఖర్ విశ్వప్రసాద్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. చిత్రయూనిట్‌కు అభినందనలు తెలిపారు.

విజనరీ ఇన్‌సైట్స్ సంపాదక వర్గానికి ప్రశంస

ప్రజాశక్తి- వేపగుంట : డెహ్రాడూన్‌లో పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ అఫ్ ఇండియా జాతీయ అవార్డుల ప్రదానోత్సవం లో ద్వితీయ బహుమతి సాధించిన శంకర్ ఫౌండేషన్ నెలవారీ వార్తాలేఖ 'విజనరీ ఇన్‌సైట్స్' సంపాదకవర్గాన్ని ప్రశంసలతో ముంచెత్తి అభినందించారు. డెహ్రాడూన్‌లో బహుమతి కింద స్వీకరించిన షీల్డ్‌ను శంకర్ ఫౌండేషన్ హెచ్‌ఆర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్‌కెఎల్.రావుకు విజనరీ ఇన్‌సైట్స్ ఎడిటర్, కె బంగార్రాజు అందజేసి, అంకితం చేయగా, బుధవారం ఎడిటర్ బంగారురాజుతోపాటు సంపాదకవర్గాన్ని శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్‌ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, జనరల్ మేనేజర్ కె. రాధాకృష్ణన్ అభినందించారు. కంటి సంరక్షణలో ధ్రువ తారగా నిలిచిన శంకర్ ఫౌండేషన్‌కు జాతీయ స్థాయిలో ఈ గుర్తింపు రావడం వరుసగా రెండోసారి కావడం విశేషం.

టిడిపి కార్యాలయ నిర్మాణానికి సహకరించాలి

ప్రజాశక్తి-పద్మనాభం: మండల కేంద్రమైన పద్మనాభం జంక్షన్లో మండల కాంప్లెక్స్ ప్రాంగణానికి ఆనుకొని ఉన్న మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణానికి నాయకులు కార్యకర్తలు సహకరించాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కోరాడ రమణ. కోరారు. బుధవారం జిల్లా పరిషత్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మండల తెలుగుదేశం పార్టీ విస్తృత సమావేశంలో మాట్లాడుతూ, జనవరి ఒకటో తేదీ నాటికి నిర్మాణం చేపట్టిన భవనం శ్లాబు పూర్తి చేయాలని, దానికి నిధులు సమకూర్చాల్సి ఉందన్నారు.

ఆలోచింపజేసిన సైన్స్ ఎగ్జిబిషన్


భీమిలిలో సైన్స్ నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - భీమునిపట్నం : మండల వనరుల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆలోచింపజేసింది వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు వారి సృజనాత్మక ఆలోచనలకు అద్దం పట్టాయి. వీటిలో జిల్లా స్థాయికి ఏడు సైన్స్ ప్రాజెక్ట్ లు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు నాల్గో వార్డు మంగమారిపేట, చిన ఉప్పాడ, మండలంలోని మజ్జివలస, లక్ష్మీపురం, అమనాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎపి బాలికల గురుకుల పాఠశాల, మూలకుద్దు ఎంపియుపి పాఠశాల విద్యార్థుల ప్రాజెక్ట్ లు ఎంపికైనట్లు ఎంఇఒ , జయప్రద తెలిపారు

పద్మనాభం: మండలంలోని రెవిడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మండల స్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌ను ఎంపిపి కె.రాంబాబు ప్రారంభించారు. వీటిలో ఏడు విద్యార్థి గ్రూపు ప్రాజెక్టులు, ఇద్దరు విద్యార్థుల వ్యక్తిగత ప్రాజెక్టులు, రెండు టీచర్ ఎగ్జిబిట్ ప్రాజెక్టు నమూనాలను జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక చేశారు.

కార్యకర్త కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి తగరపువలస : అనారోగ్యంతో మరణించిన జివిఎంసి ఒకటో వార్డు చిట్టివలసకు చెందిన సీనియర్ కార్యకర్త గాజుల .సింహాద్రి కుటుంబానికి టిడిపి శ్రేణులు అండగా నిలిచారు. మాజీ వైస్ చైర్మన్ మద్దుల. దేవుళ్ళు, మాజీ కౌన్సిలర్ చిలక నర్సింగరావు ఆధ్వర్యంలో టిడిపి కుటుంబ సభ్యులంతా రూ.25 వేలనగదు,.బట్టలు సాయంగా అందజేశారు .సింహాద్రి మరణం పార్టీకి, వారి కుటుంబానికి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో ఒకటో వార్డు టిడిపి.అధ్యక్షులు తమ్మిన సూరిబాబు, మాజీ కౌన్సిలర్ పిట్ట సురేష్, ప్రధాన కార్యదర్శి దండి వెంకటేష్, యూత్ అధ్యక్షుడు గరే సదానంద, నాయకులు నరవ రామారావు.టి .అప్పలరాజు గరే.చంద్రమౌళి, కొప్పల కృష్ణ, మద్దిల సుబ్బారావు, తీన్ మూర్తి, కోసూరు రాంబాబు, దొంతల సూర్య, పిల్లా రాజేష్ పాల్గొన్నారు

సంచార జాతులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం/ తగరపువలస : చలిపులి గజగజలాడిస్తున్న పరిస్థితుల్లో సంచారజాతులు, రోడ్డు వెంబడి ఉన్న అనాథలకు స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామచంద్రమూర్తి బుధ వారం రాత్రి దుప్పట్లు, ఆహారం పంపిణీ చేశారు. తన తండ్రి భాస్కర రావు జ్ఞాపకార్థం జివిఎంసి మూడో వార్డు పాత బస్టాండ్, బీచ్ రోడ్డు, రాజపులోవ తగరపువలస తాళ్లవలస సంగీవలస .ఆనందపురం బోయపాలెం ప్రాంతాల్లో వందమందికి అందజేశారు. కలిగొట్ల శ్రీరామ్, కలిగొట్ల భానోజీరావు కలిగొట్ల శ్రీనివాసరావు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు

సమస్యలపై నాగబాబుకు వినతి

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు జీరుపేట, చిల్లపేటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భీమిలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నాగబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. రెండోవార్డు జనసేన అధ్యక్షులు చిల్ల శంకరరెడ్డి, శ్రీనుబాబు సమస్యలను నాగబాబుకు వివరించగా, పరిష్కారానికి కృషి చేస్తాననిహామీ ఇచ్చారు.

నైపుణ్యంతోనే ఉత్తమ కెరీర్

ప్రజాశక్తి- వేపగుంట : విశాఖ ఇనిస్టిటూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగ విద్యార్థులకు ఉపాధి నైపుణ్యాలు, కెరీర్ అవకాశాలపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్‌గా విచ్చేసిన రాంచీలోని ఆర్‌టిసి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. హరిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్ని ఇంజనీరింగ్ విభాగాలకు మూల స్తంభం లాంటిదని, మెకానికల్ ఇంజనీర్లకు ఆటోమోటివ్ నుండి ఏరోస్పేస్ వరకు మ్యానుఫ్యాక్చరింగ్ నుండి రోబోటిక్స్ వరకు ఎన్నో పరిశ్రమల్లో ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుందన్నారు. అయితే పోటీ ప్రపంచంలో విజయవంతం కావడానికి సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఉపాధి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివి.ప్రదీప్ వర్మ, డీన్ అకాడమిక్స్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ డి..శాంతారావు, సెమినార్ కోఆర్డినేటర్ కె. చందన, ఎం రాంబాబు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఘనంగా సిపిఐ శత వార్షికోత్సవం

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి ఐదోవార్డు నగరంపాలెంలో సిపిఐ శత వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాన్ని విశాఖ పోర్టు విశ్రాంత కార్మికుడు వాసుదేవ వెంకట రామారావు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పార్టీ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ, శ్రామికులు, కర్షకులు, అణగారిన ప్రజల సమస్యల పరిష్కారానికి ఆవిర్భవించిన సిపిఐ ఈ నెల 16నాటికి శతవసంతాలను పూర్తిచేసుకుంటుందన్నారు. స్వాతంత్ర ఉద్యమంలోను, స్వాతంత్ర అనంతరం గడిచిన వందేళ్ళుగా ఎన్నో ప్రజాఉద్యమాలు చేసిందన్నారు.కార్యక్రమంలో పార్టీ ఏరియాకార్యదర్శి వి సత్యనారాయణ, సభ్యులు వి నరసింహులు, అప్పలకొండ, పివి అప్పారావు, సంధ్యా కుమారి, పార్వతీదేవి, ఎంఎస్ పాత్రుడు, జగ్గా స్వామి, మంగ, కాళిదాసు, సతీష్ పాల్గొన్నారు

స్మార్ట్ నైపుణ్యాలతో కేథరిన్‌లో విద్యాబోధన

ఉపాధ్యాయులందరికీ గూగుల్ జెమిని ప్రామాణీకరణ



ఉపాధ్యాయులందరికీ గూగుల్ జెమిని ప్రామాణీకరణ

ప్రజాశక్తి-భీమునిపట్నం :క్లాస్‌రూమ్ బోధనలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ సాంకేతికతలను ఉపయోగించి స్మార్ట్‌బోర్డుల ద్వారా విద్యాబోధనలో కేథరిన్ సిబిఎస్‌ఇ. స్కూల్ ఉపాధ్యాయులందరూ గూగుల్ జెమిని క్లాస్‌రూమ్ శిక్షణతో ప్రమాణీకరణ పొందారని సంస్థ అధినేత ఆలివర్ రాయ్, డైరెక్టర్ డాక్టర్ ఇవాంజలిన్ రాయ్ తెలిపారు. ప్రతిష్టాత్మక గూగుల్ జెమిని ప్రమాణీకరణ పొందిన ఉపాధ్యాయులున్న ఏకైక విద్యా సంస్థగా కేథరిన్ గుర్తింపుపొందిందని వెల్లడించారు. పాఠశాల మూడో వార్షికోత్సవం సందర్భంగా శ్రీకాకుళం జిల్లా, ఎచ్చెర్ల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ రెమి రజని నుంచి సంబంధిత ప్రమాణ పత్రాలను వారి సమక్షంలో ఉపాధ్యాయులకు అందజేశారు.

స్మార్ట్ బోర్డులు ఇంటరాక్టివ్ కంటెంట్, రియల్–టైమ్ ఫీడ్‌బ్యాక్, ఆకర్షణీయమైన పాఠాలను బోధన చేస్తూ, విద్యా ప్రక్రియను మరింత ఆధునికంగా మారుస్తూ, విద్యార్థుల డిజిటల్ నైపుణ్యాలను పెంచి, వారిని భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ ఈవంజలిన్ రాయి తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-మధురవాడ : రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల విభాగం ఆధ్వర్యంలో అగ్నిమాపక అవగాహన ప్రాయోగిక శిక్షణ కార్యక్రమాన్ని, ఒక రోజు ఫీల్డ్ విజిట్‌ను బుధవారం గీతం విశ్వవిద్యాలయం దంత కళాశాల ఆవరణలో నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించడం, ప్రాథమిక అగ్నిమాపక చర్యలపై చేతికందే శిక్షణ ఇవ్వడం, అలాగే అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ఆధునిక అగ్నిమాపక రక్షణ వాహనం అయిన బ్రాంటో స్కైలిఫ్ట్ 90 హెచ్‌ఎల్‌ఎ ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో అధునాతన అగ్నిమాపక సాంకేతికతల వినియోగంపై ప్రత్యక్ష అవగాహన కలిగించారు. విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో అగ్ని భద్రత, విపత్తు నిర్వహణపై ప్రాయోగిక జ్ఞానం, సన్నద్ధతను పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని గీతం సీనియర్ సేఫ్టీ అధికారి కె.పి.చక్రధర్ తెలిపారు.

మత్స్యకారులకు అండ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

ప్రజాశక్తి-గాజువాక : గంగవరం, దిబ్బపాలెం మత్స్యకారులకు అండగా ఉంటానని గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు భరోసానిచ్చారు. బుధవారం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఆయా గ్రామాల పెద్దలతో సమావేశంలో గంగవరం పోర్టులో భూములు కోల్పోయిన మత్స్యకారులకు జీవనభృతికి రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో రూ. 10.50కోట్లను అందజేస్తామన్నారు మత్స్యకారుల చేపల వేటకు జెట్టి నిర్మాణ పనులు చేపట్టబోతున్నట్లు తెలిపారు. గంట్యాడ నుండి గంగవరం వెళ్లే ప్రధాన రహదారిని రూ.8కోట్లతో పునర్నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. గంగవరం, దిబ్బపాలెం గ్రామాల్లో ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతులు, పాఠశాల గ్రౌండ్ సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పెద్దమ్మవారి గుడి ప్రహరీ కట్టిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు కోవిరి హరికృష్ణ, కార్యదర్శి పోలిరాజు, రెండు గ్రామాల నాయకులు భార్గవ, దేవుడు, నల్లయ్య, పెంటయ్య, నర్సింగరావు, సోడిపల్లి దేవుడు, మాధవ, అమ్మోరు, నలు గురువులు, పైడిరాజు పాల్గొన్నారు..

నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు జశ్వంత్


బండారు జశ్వంత్

ప్రజాశక్తి-ఆనందపురం: మ్యాథమెటిక్స్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రీజినల్ మాథ్స్ ఒలింపియాడ్ 2వ స్థాయి పరీక్షల్లో కెకెఆర్. గౌతమ్ హైస్కూల్ టెన్త్ విద్యార్థి బండారు జశ్వంత్ విశేష ప్రతిభను కనబర్చి ఇండియన్ నేషనల్ మాథ్స్ ఒలింపియాడ్ మూడవ స్థాయికి అర్హత సాధించాడని పాఠశాల డీన్ శేషబాబు తెలిపారు. ఈ సందర్భంగా జశ్వంత్‌ను మ్యాథ్స్ హెచ్‌ఒడ కెవిఆర్. మూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ కెవిఆర్, కెమిస్ట్రీ హెచ్‌ఒడి. వేణుగోపాల్ అభినందించారు. విద్యార్థి నిరంతర కృషి, ఉపాధ్యాయుల సమర్థ మార్గనిర్దేశం, తల్లిదండ్రుల సహకారంతోనే ఇది సాధ్యమైందని తెలిపారు. జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు

టెట్ పరీక్షకు 91.36 శాతం హాజరు

ప్రజాశక్తి - ఆరిలోవ : జిల్లాలో బుధవారం జరిగిన ఉపాధ్యాయ అర్హత(టెట్) పరీక్షకు 91.36 శాతం అభ్యర్థులు హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 కేంద్రాల్లోను, మధ్యాహ్నం 8 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 1761 మంది అభ్యర్థులు హాజరుకావలసి ఉండగా, 1609 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి రెండు కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ 4 కేంద్రాలను సందర్శించారు.

నిరుపయోగంగా మార్కెట్ యార్డు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి బెల్లం మార్కెట్ యార్డులో నిర్మించిన బ్లాక్‌లు ఖాళీగా ఉండటంతో నిరుపయోగంగా మిగిలిపోయాయి. ఈ మార్కెట్ యార్డులో వందల ఎకరాల్లో స్థలం ఖాళీ ఉంది. మరో పక్క జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. స్థిర భవనాల కోసం ప్రభుత్వానికి స్థలాభావం ఉండగా, మార్కెట్ యార్డ్‌లో స్థలం ఖాళీగా ఉండటంపై పలువురు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలను ఒక్క చోట సమీకరించి యార్డులో ఏర్పాటు చేస్తే ప్రజలకు, అధికారులకు చాలా సౌకర్యంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రభుత్వానికి అద్దె భారం కూడా తగ్గుతుందనే వారు లేకపోలేదు. కొంతమంది రైతులు, వ్యాపార వర్గాలు ఇప్పటికే ప్రభుత్వం ఖాళీ ప్రదేశాన్ని రైతు బజార్ నిర్మాణం కోసం ఉపయోగిస్తే బాగుంటుందని అభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నారు. మరికొందరు కొత్త కోర్టు భవనం, కోర్టు కాంప్లెక్స్, ఇన్టిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆఫీస్ కాంప్లెక్స్, వ్యవసాయ సంబంధిత శిక్షణ కేంద్రాలు, గిడ్డంగులు వంటి వాటికి ఉపయోగిస్తే మేలని అంటున్నారు. బెల్లం మార్కెట్ స్థలంలో పావు వంతు కూడా ఉపయోగంలో లేదు. మార్కెట్ ఉనికి కూడా కోల్పోతున్న నేపథ్యంలో, అక్కడి విస్తారమైన ఖాళీ ప్రదేశాలను పూర్తిస్థాయిలో ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాలని ప్రజలు కోరుతున్నారు. మార్కెట్ యార్డ్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం ప్రభుత్వ శాఖలు ఇక్కడ స్థాపించడం సులభమనేది నిపుణుల అభిప్రాయం కూడా. ఇక్కడి పాలకులు ప్రభుత్వానికి సమగ్ర ప్రతిపాదన అందిస్తే త్వరితగతిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని క్షేత్ర స్థాయిలో పలువురు భావిస్తున్నారు.


ఖాళీగా ఉన్న మార్కెట్ యార్డులోని బ్లాక్‌లు


సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంపిపి రాజాన శేషు

సృజనాత్మకత పెంపునకు సైన్స్ ఫెయిర్‌లు దోహదం

ప్రజాశక్తి-యలమంచిలి : సృజనాత్మకత పెంపొందించేందుకు సైన్స్ ఫెయిర్‌లు దోహదం చేస్తాయని ఎంపిపి రాజాన శేషు అన్నారు. యలమంచిలి కొత్తపేట హైస్కూల్లో ఏర్పాటు చేసిన మండలస్థాయి సైన్స్‌ఫెయిర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఇటువంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని సూచించారు. వివిధ రకాల ప్రాజెక్టులు, ప్రయోగాల ప్రదర్శనను పరిశీలించి అభినందించారు. మండలంలోని 10 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొని వారి వారి ప్రయోగాలు ప్రదర్శించారు. ఎంఇఓ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ మండల స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టును జిల్లాస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ అరుణ్ కుమార్, మండల స్థాయి కన్వీనర్ వైవి.రమణ, జనసేన నాయకులు అన్నం బాబ్జీ, కరణం రవికుమార్, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

27న కుంచావారి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక కుంచావారి శ్రీ గౌరీ పరమేశ్వరుల అమ్మవారి ఉత్సవం ఈ నెల 27న ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఎం వీరభద్రరావు (అబ్బులు) మాట్లాడుతూ ముందుగా ఈనెల 20న నిర్వహించాలని అనుకున్న అనివార్య కారణాలవల్ల ఈనెల 27కు వాయిదా వేయడం జరిగిందన్నారు. కుంచా వారి గౌరీ పరమేశ్వరుల స్థాపితం 1811 సంవత్సరంలో జరిగిందని, 214 సంవత్సరాల ఘన చరిత్ర కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ట్రెజరర్ కర్రి కృష్ణ, గౌరవాధ్యక్షులు పాండ్రంగి సత్యరావు, కోరుకొండ సాంబశివరావు, కొమ్మోజి రామకష్ణ, పాలూరి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఖాళీ చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఫుట్ పాతుల ఆక్రమణ తొలగించాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని పెరుగు బజార్ రోడ్ తదితర ప్రాంతాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఫుట్‌పాత్‌లు మీద ఉన్న వాటిని ఖాళీ చేయించమని ఆదేశించారు. ఆయన వెంట జీవీఎంసీ ఈఈ, టిపిఓ తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-పాయకరావుపేట : పట్టణంలోని ఎస్ఆర్‌జిజె కాలేజీ వెనుక గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీవరద వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం ధనుర్మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 17 నుండి జనవరి 14 వరకూ ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ధనుర్మాస పూజ నిమిత్తం రుసుము రూ.300 నిర్ణయించామన్నారు. పూజలు చేయించుకొన్న భక్తులు సదరు తేదీన సమారాధన ప్రసాదం తీసుకొనుటకు ఈ కార్డు తప్పకుండా తీసుకొని రావలని, కార్డుకు ఇద్దరు మాత్రమే రావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కోసం 9848731878, 9866276933 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కమిటీ సభ్యులు తెలియజేశారు.

ముఖ్యమంత్రి దృష్టికి కోతుల సమస్య

ప్రజాశక్తి-అనకాపల్లి : అల్లూరి సీతారామ రాజు జిల్లా నుంచి అనకాపల్లి జిల్లాలోకి వలస వచ్చిన కోతులు వ్యవసాయ పంటలను తీవ్రంగా నాశనం చేస్తున్నాయని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రితో బుధవారం నిర్వహించిన 5వ కలెక్టర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలోని 12 మండలాల్లో కోతుల బెడద కారణంగా రైతులు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిలువ పంటలను కోతులు నాశనం చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి రైతులకు జరుగుతున్న నష్టంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై పంట నష్టం జరగకుండా అటవీ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే ప్రభావవంతమైన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. రైతులకు మరింత నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని త్వరితగతిన ఉపశమనం కల్పిస్తామని భరోసా ఇచ్చినట్టు కలెక్టర్ పేర్కొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో యాజమాన్య ప్రతినిధులు

ప్రజాశక్తి-కశింకోట : తుమ్మపాలలో ఈ నెల 16న జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీలలో స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న కె.సామ్యూల్ దయానంద్ జూనియర్ బాలుర విభాగంలోనూ, టి.జయశ్రీ బాలికల విభాగంలోనూ విజేతలుగా నిలిచారు. వీరు ఈ నెల 19 నుండి 21వ తేదీ వరకు ప్రకాశం జిల్లా జైపంగులూరులో జరుగనున్న 44వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రూపానంది తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పిఇటి సిహెచ్‌ఎల్‌ఎ.శ్రీనివాస్‌ను స్కూల్ కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపల్ రూపానంది అభినందించారు.

ఎఎస్.పేట విద్యార్థి...

కశింకోట : ఈనెల 19 నుండి 21 వరకు ప్రకాశం జిల్లా జైపంగులూరులో జరిగే ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల జూనియర్స్ బాలబాలికల ఖోఖో పోటీలకు ఎఎస్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అంబటి లాస్య ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జయబాబు తెలిపారు. ఈ మేరకు లాస్యను పాఠశాల హెచ్ఎ లంక శ్రీనివాసరావు, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ అంబటి చిన్న లక్ష్మి నర్సింగరావు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.


లాస్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అబాకస్‌లో శ్రీగాయత్రి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కశింకోట : అనకాపల్లిలో ఈ నెల 14న జరిగిన అబాకస్ పోటీల్లో తాళ్లపాలెం శ్రీగాయత్రి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ బి. రామ్‌కుమార్ బుధవారం తెలిపారు. రైజింగ్ స్టార్‌లో డి.పార్థు (ఒకట తరగతి), ఓ.చైతన్య (3వ తరగతి) జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, విజయవాడలో జరగబోయే రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విజయం పట్ల పాఠశాల కరస్పాండెంట్ బి.రామ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు


మెటీరియల్ అందజేసిన దృశ్యం

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం జెడ్‌పి హైస్కూల్‌లో బుధవారం విశాఖ డెయిరీ వేతన కార్యదర్శి శరగడం వర ప్రసాదరావు ఆర్థిక సహాయంతో 36 మంది పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు, హెచ్ఎం ఎస్.రవి, కాండ్రేగుల రమేష్, పద్మావతి, జెవివి నాయకులు మారిశెట్టి వెంకట అప్పారావు, యుటిఎఫ్ ప్రతినిధి రాము ఉప్పాడ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాతో నేర నియంత్రణ చర్యలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామాలు, కాలనీలు, రహదారులు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షణ నిర్వహిస్తున్నామని ఎస్సై ధనుంజయ్ తెలిపారు. డ్రోన్ నిఘా ద్వారా అనుమానాస్పద కదలికలను గుర్తించి, చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా రాత్రి వేళల్లో చోరీలు, అసాంఘిక కార్యకలాపాలు, మద్యం సేవించి వాహనాలు నడపడం, గుంపులుగా తిరగడం, గంజాయి అక్రమ రవాణా , వంటి ఘటనలను నియంత్రించేందుకు డ్రోన్ టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతోందని చెప్పారు.

ఘనంగా లక్ష ప్రదక్షిణ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గవరపాలెం అగ్గిమర్రి చెట్టు వద్ద ఉన్న శ్రీసుభద్ర బలభద్ర సమేత జగన్నాథ స్వామి దేవస్థానంలో లక్ష ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ బుధవారం ప్రారంభించారు. మొట్టమొదటిసారిగా ధనుర్మాసం సందర్భంగా నెల రోజుల పాటు డిసెంబర్ 16 నుంచి జనవరి 16 వరకు శ్రీజగన్నాథ స్వామి ఆలయం చుట్టూ లక్ష ప్రదక్షణ నిర్వహించడం జరుగుతుందని ఆలయ చైర్మన్ దాడి బుజ్జి తెలియజేశారు. అనంతరం జగన్నాథ స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షణ చేశారు. కార్యక్రమంలో జగన్నాథ్ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ధర్మకర్తలు కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్తు అత్యవసర సమావేశం

ప్రజాశక్తి-యలమంచిలి : ఎంపిపి రాజాన సూర్యచంద్ర శేషగిరిరావు ఆదేశాల మేరకు గురువారం మండల పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ కె.ఎస్.కొండలరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి అధ్యక్షతన జరిగే సమావేశంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై సభ్యుల అభిప్రాయాలు వెల్లడించే అవకాశం ఉంది. కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపిటీసీలు హాజరౌతారని తెలిపారు.

పిఎసిఎస్ అధ్యక్షునిగా నరేష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది పిఎసిఎస్ అధ్యక్షునిగా టిడిపి వడ్డాది అధ్యక్షుడు దొండ నరేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నరేష్‌తో పాటు త్రిసభ్య కమిటీ సభ్యులు దొండ సాయి, చల్లా లోవరాజు బాధ్యతలు చేపట్టారు. వారికి పిఎసిఎస్ సిఇఒ ఎ.శాంతి, సిబ్బంది శుభాభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ నరేష్ మాట్లాడుతూ తనకిచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. సన్న చిన్న కారు, కౌలు రైతులకు అధికంగా రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జనసేన ఇన్చార్జి పీవీఎస్ఎన్ రాజు, బిజెపి ఇన్చార్జి కందర్ప రమణమూర్తి సహకారంతోనే తనకు ఈ పదవి లభించిందని చెప్పారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్ దొండ నరేష్

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి పట్టణంలోని ఎన్జిఓ హోమ్‌లో అఖిలభారత్ పెన్షనర్స్ డే సందర్భంగా బుధవారం సిహెచ్ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మొదటిగా గతంలో వివిధ ఉద్యోగ సంఘాలలో పనిచేసి 80 సంవత్సరాలు నిండిన యలమంచిలి స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ సోమేశ్వరరావును, 75 సంవత్సరాలు నిండిన సర్వీస్ పెన్షనర్లు ఏడుగురును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సబ్ ట్రెజరీ ఆఫీసర్ టి.ఉదయ భాస్కరరావు, స్టేట్ బ్యాంక్ మేనేజర్ జి ప్రకాష్, పెనుగల్లు స్టేట్ బ్యాంక్ మేనేజర్ కె విద్యాసాగర్, విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్ మేనేజర్ వై రోహిణి, సంఘ కార్యదర్శి జి.సాంబమూర్తి, పెద్ద ఎత్తున పెన్షనర్లు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పెన్షనర్స్ డే వేడుకలు నిర్వహించారు. పివిఆర్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎస్ రాఘవరావు, ఎస్ పరదేశి నాయుడు హాజరయ్యారు. కార్యక్రమంలో బి.నరసింహమూర్తి, అరసాడ సూర్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పది మంది పెన్షనర్లను సన్మానించారు.

వడ్డాది : పెన్షనర్స్ డే సందర్భంగా బుధవారం వడ్డాదిలో ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కనీస పెన్షన్ రూ.9వేలుతో డీఏ ఇవ్వాలని కోరారు. రైల్వే రాయితీలు, భార్యాభర్తలకు ఉచిత మెడికల్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల హక్కుల కోసం కృషి చేసిన ఐఎఎస్ అధికారి డిఎస్ నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పి.సాంబశివరావు, ఎస్.భాస్కరరావు, ఎస్.లక్ష్మి నారాయణ, టి.సత్యనారాయణ, లక్ష్మణరావు, అయ్యప్ప పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయం దరి సరస్వతీ సమాజం ఆవరణలో బుధవారం జాతీయ పింఛనుదారుల దినోత్సవం నిర్వహించారు. ఎపి పింఛనుదారుల సంఘం భీమిలి తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సంఘం అసోసియేట్ అధ్యక్షులు ఎం.ఆనందరావు, కార్యదర్శి కె సన్యాసినాయుడు మాట్లాడుతూ, జాతీయ పెన్షనర్ల పితామహుడు డాక్టర్ నకారా కృషి ఫలితంగానే పింఛను హక్కును పొందగలిగామన్నారు. ముందుగా డాక్టర్ నకారా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి రామకృష్ణ, నాయకులు బి ఈశ్వరరావు పాల్గొన్నారు

హెచ్ఎస్ఎల్ రిటైర్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం

విశాఖ కలెక్టరేట్ : హిందుస్థాన్ షిప్ యార్డ్ రిటైర్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవం, జాతీయ పెన్షనర్స్ డే కార్యక్రమాలు బుధవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పదిమంది దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో 120 మంది హాజరయ్యారు. కొన్ని తేలికపాటి ఆటలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి కె.సుధాకరరావు మాట్లాడుతూ, పెన్షన్ డే ప్రాముఖ్యత, పెన్షన్ నేటి పరిస్థితిని వివరించారు. అధ్యక్షులు బూసి ప్రసాద్ సంఘం కార్యకలాపాలను వివరించారు.

పిఆర్ రిటైర్డ్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ డే

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ఇంజినీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పరిషత్ ప్రాంగణంలోని పిఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాలు పైబడిన 10 మంది సభ్యులను సత్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షులు బి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.కూర్మారావు మాట్లాడుతూ, సుదీర్ఘకాలం ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగికి పెన్షన్ పొందడం హక్కు అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.సత్తిబాబు, నాయకులు వి.వెంకటేశ్వరరావు, ఆర్.కృష్ణకుమార్, డిఎం.ప్రమీల, డిఎస్కె.ప్రకాష్, వెంకటరావు, ఒ.చిట్టిబాబు పాల్గొన్నారు.


సత్కరిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు


గణిత నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జాతీయ గణిత పక్షోత్సవాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ గణిత పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది విద్యార్థులు వివిధ గణిత నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ప్రధానోపాధ్యాయులు కేతిరెడ్డి సత్యారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా. ఆయన మాట్లాడుతూ గణిత నమూనాల వలన విధార్థులలో స్పష్టమైన అవగాహన, ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. గణిత ఉపాధ్యాయులు ఏవిఎన్ మూర్తి, శివ జ్యోతిల ఆధ్వర్యంలో 300 మంది విద్యార్థులు 300 గణిత నమూనాలు తయారు చేసి, ప్రదర్శించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డివిజె అప్పారావు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభం ప్రతిష్టకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కొత్తూరు సింహబలుడు మెట్టపై శ్రీపద్మనాభ సీతారామాలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం ప్రతిష్టకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేవాదాయ, అటవీ శాఖ సహకారంతో 70 సంవత్సరాల వయసు కలిగిన చెట్టును అనంతగిరి ఏజెన్సీ నుండి విజయరామరాజుపేట బ్రిడ్జ్ వరకు తరలించారు. అక్కడి నుండి ఆలయ ప్రాంగణం వరకు బాజా బజంత్రీలు, కోలాటాలు, మంగళ వాయిద్యాల మధ్య ధ్వజస్తంభం చెట్టును ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, పిఎసిఎస్ అధ్యక్షుడు దొండా నరేష్, ఉపసర్పంచ్ దాడి సూర్య నాగేశ్వరరావు, సీనియర్ టిడిపి నేత దొండా గిరిబాబు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, కొత్తూరు గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాలలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- పాయకరావుపేట : సమత కమ్యూనిటీ డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన బాలలకు బుధవారం నూతన దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ ఎస్ఏ మహేశ్వరరావు, ఎమ్ఇవో కెఎన్ గాంధీ, బట్టలు బహుకరించిన కె.శామ్యూల్, సమత సంస్థ అధినేత కె.యోహాన్, సెక్రటరీ సిహెచ్ వరప్రసాద్, ఆర్ఐ టి త్రినాథ్, గ్రేస్, జియల్‌యన్ దిలీప్ కుమార్, సమత ప్రాజెక్ట్ మేనేజర్ వి చక్రధరరావు, బి అనిల్ కుమార్, ఏసుబాబు, విజయ డేనియల్ తదితరులు పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న సమత సొసైటీ ప్రతినిధులు

గిరిజనులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : హైదరాబాద్ సత్యసాయి సేవా సమితి వారి ఆర్థిక సహాయంతో, అనకాపల్లి జిల్లా సత్యసాయి సేవ సమితి వారు బుధవారం మండలంలోని వాలాబు పంచాయతీ పరిధిలో 14 గిరిజన గ్రామాల్లో సుమారు 200 మంది గిరిజనులకు రగ్గులు పంపిణీ చేశారు. సాయి భక్తులు శశిభూషణరావు, ఇతిస్ వెంకట సాయి చేతుల మీదుగా గిరిజనులకు అందజేశారు. రహదారి సౌకర్యం లేని గ్రామాలకు గెడ్డలో దిగి, కొండలు సైతం ఎక్కి ఆయా గ్రామాలకు చేరుకొని అందజేశారు. కార్యక్రమంలో సత్య సాయి భక్తులు ఆదిరెడ్డి కన్నబాబు, పెంటారావు పాల్గొన్నారు.


గిరిజనులకు రగ్గులు పంపిణీ చేస్తున్న సత్యసాయి సమితి సభ్యులు

బి.కామ్ విద్యార్థుల క్షేత్ర సందర్శన



క్షేత్ర సందర్శనలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థులు అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం, కాశీపట్నం వారపు సంతలో బుధవారం క్షేత్ర సందర్శన చేశారు. వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి మడగల గోవిందరావు నాయకత్వంలో మార్కెటింగ్ విషయ పరిజ్ఞానంలో భాగంగా 'అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు కాశీపట్నం సంత' అనే అంశంపై ఈ క్షేత్ర సందర్శన చేపట్టారు. ఈ విద్యా వైజ్ఞానిక యాత్రను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదులలో నేర్చుకున్న జ్ఞానాన్ని, ఇటువంటి క్షేత్ర సందర్శనల ద్వారా, ప్రత్యక్షంగా అనుభవాన్ని పొంది, వారి నైపుణ్యాలను, పరిశీలనాశక్తిని మరింత పెంపొందించుకొనేందుకు అవకాశం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సత్యనారాయణ, డాక్టర్ ఎల్.గణేష్, జి.యమున, వి. రజని తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-చోడవరం : విద్యుత్తు పొదుపు వల్ల ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని ఏపీఈపీడీసీఎల్ నర్సీపట్నం డిఈ ఏవిఎన్ అప్పారావు అన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఈడి బల్బ్, ఫైవ్ స్టార్ రేటింగ్ ఫ్రిడ్జ్, గ్రైండర్, ఏసి వంటి వాటిని వాడితే మనకి ఇంధనం ఆదా అవుతుందన్నారు. ప్రతి ఇంటికి పైన సోలార్ రూఫ్ టాప్ వేసుకొని మరింత విద్యుత్ ఆదా చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో చోడవరం ఏడిఈ వై.సురేష్ కుమార్, ఏఈ శ్రీనివాసరాజు, లైన్ ఇన్‌స్పెక్టర్ రవి సత్యనారాయణ పాల్గొన్నారు.



విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఏఎమ్ఏఎ హైస్కూల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యాన బుధవారం విద్యార్థులకు ప్రథమ చికిత్స, సిపిఆర్ ఏ విధంగా చేయాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ బుద్ధ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి నెల సేవా కార్యక్రమంలో భాగంగా సిపిఆర్ అవగాహన సదస్సు నిర్వహించామని తెలిపారు. ముఖ్య అతిథి డాక్టర్ సునీల్ మాట్లాడుతూ హార్ట్ ఎటాక్ వచ్చిన రోగులకు తక్షణమే సిపిఆర్ చేయడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చునని తెలియజేశారు. సిపిఆర్ చేయడం వల్ల గుండె తిరిగి కొట్టుకొని ఊపిరితిత్తులు పనిచేసి బ్రెయిన్ కు రక్తం సరఫరా అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమం క్లబ్ కార్యదర్శి కెవిపిఎస్ ప్రకాష్ రావు, కోశాధికారి బి సర్వారావు, ఎన్టీఆర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పృథ్వి, హైస్కూల్ కరెస్పాండెంట్ కొణతాల శివకుమార్, హైస్కూల్ అధ్యక్షులు గ్రంధి సురేష్, డాక్టర్ గ్రంధి శేష్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు కోరిబిల్లి నాగమణి, ఉపాధ్యాయులు విద్యార్థులు, క్లబ్ సభ్యులు బుద్ధ సత్యనారాయణ, పిజె నాయుడు, సాన త్రినాధ్, కాండ్రేగుల జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

శేషుగెడ్డలో పూడిక తీయాలని వినతి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : స్థానిక ఎమ్మెల్యే విజయ్ కుమార్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన జనవాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. భారీగా వచ్చిన జనం ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. జనసేన టౌన్ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు పెద్దపల్లి శేషుగెడ్డ పూడికతో నిండిందని, పూడిక తొలగించి, అవసరమైన చోట్ల గట్లు బలంగా వేయాలని విన్నవించారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైఎస్.జగన్‌ను కలిసిన మాజీ ఎంపీ సత్యవతి

ప్రజాశక్తి-అనకాపల్లి : మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని బుధవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో అనకాపల్లి మాజీ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ సత్యవతి విష్ణుమూర్తి దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలకు వాటర్ ట్యాంక్, ఫిల్టర్ వితరణ

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి మండలం, పులపర్తి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు, లక్కవరం పీఏసీఎస్ డైరక్టర్ దుల్లా భగవాన్ రూ.30 వేలు తన సొంత నిధులతో నూతన తాగునీటి ట్యాంకు, నూతన వాటర్ ఫిల్టర్ సేట్‌ను పులపర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు సమకూర్చారు. వీటిని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఇ శివప్రసాద్, డి పేరిశెట్టి భగవాన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు దుల్లా అశోక్, మాలం సింగ్, శెట్టి శ్రీను, మాపడ ధర్మరాజు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై శిక్షణ

ప్రజాశక్తి-కశింకోట : పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఎస్.తిరుపతిరావు ఆధ్వర్యంలో మండల టాస్క్‌ఫోర్స్ శిక్షణ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లలు నుండి 5 సంవత్సరాలు వయస్సు వున్నా పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు. పిహెచ్‌సి పరిధిలో 6,795 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రములో డాక్టర్ వై.యశోద, సిహెచ్ సత్యనారాయణ, అంగన్వాడీ, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే లక్ష్యం

-స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్

ప్రజాశక్తి-నాతవరం:పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి, రైతును రాజుగా చేయడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్పీకర్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. గతంలో రైతులు మిల్లర్లకు, దళారులకు ధాన్యం అమ్ముకుని, డబ్బుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన కేవలం 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.నర్సీపట్నం నియోజకవర్గ వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల కోసం 15 క్లస్టర్లను ఏర్పాటు చేశామని, అత్యధికంగా పంట పండే నాతవరం మండలంలోనే 8 కొనుగోలు కేంద్రాలను (ఎం.బి.పట్నం, గన్నవరం, వై.డి.పేట, గునుపూడి, గుమ్మడిగొండ, చెర్లోపాలెం, శృంగవరం, గొల్లొండపేట) ఏర్పాటు చేసినట్లు స్పీకర్ వివరించారు. రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లుకు ధాన్యాన్ని తరలించే వెసులుబాటు కల్పించామన్నారు. రైతులు నేరుగా 73373 59375 అనే వాట్సాప్ నంబర్ ద్వారా స్లాట్ బుక్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. నియోజకవర్గంలో 32 వేల ఎకరాల్లో వరి సాగు జరగగా, సుమారు 70 వేల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. నాతవరంలో 15 వేల టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, రైతుల అవసరార్థం మరో 10 వేల టన్నులైనా కొంటామని భరోసా ఇచ్చారు. గత ఏడాదితో పోలిస్తే క్వింటాకు రూ. 69 పెంచి, 'ఏ' గ్రేడ్ రకానికి రూ. 2389, సాధారణ రకానికి రూ.2369 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రవాణాకు ఇబ్బంది లేకుండా నాతవరం మండలానికి 44 ట్రాక్టర్లను, 60 వేల గోనె సంచులను సిద్ధం చేశామన్నారు. ఎరువుల కొరత రాకుండా 1500 మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ ఉంచామన్నారు. అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. తాండవ రిజర్వాయర్ గేట్ల మరమ్మతులు పూర్తి చేయడంతో నీరు వృథా కాకుండా పంటలకు సమృద్ధిగా నీరందిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ సూర్యచంద్ర, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మరిడయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెలగ కృష్ణారావు, ఇతర అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఐటిడిపి ప్రధాన కార్యదర్శిగా సత్తిబాబు



ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో అమలాపురం గ్రామానికి చెందిన ఏరిపిల్లి సత్తిబాబును పాయకరావుపేట నియోజక వర్గం ఐటిడిపి ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు సత్తిబాబు హోం మంత్రి వంగలపూడి అనిత, పాయకరావుపేట నియోజక వర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరకు అందేవిధంగా కృషి చేస్తానని, పార్టీ అందిస్తున్న సేవలు ప్రచారం చేపడతానని అన్నారు.


భూమి పూజ చేస్తున్న జనసేన నేతలు

మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శ్రీకారం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో జానకయ్యపేట గ్రామంలో కొత్త కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామానికి చెందిన జనసేన పార్టీ శ్రేణుల సొంత నిధులతో మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు జనసేన పార్టీ జిల్లా జాయింట్ సెక్రెటరీ కురుందాసు అప్పలరాజు తెలిపారు. బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, 60 వేలతో మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి, కాలనీలో ప్రతి ఇంటికి నీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తలసీరావు,చందక నానాజీ, మామిడి కొండలరావు,ఆనందరావు ,మురళి, నాగేశ్వరరావు, రాధాకృష్ణ, కే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పొగమంచుతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గొలుగొండ:మండల వ్యాప్తంగా దట్టమైన పొగమంచు నెలకొనడంతో వాహనదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని గొలుగొండ ఎస్సై రామారావు సూచించారు. పొగమంచు కారణంగా ముందున్న వాహనాలు, పాదచారులు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. అత్యవసర పరిస్థితులు తప్ప అవసరం లేని ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. వాహనాలను అతివేగంగా నడపకుండా పరిమిత వేగంతో నడపాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు.

అంగన్వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్ల పంపిణీ


మొబైల్ పోన్ ఇస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నాతవరం: మండలంలోని పలువురు అంగన్వాడీ టీచర్లకు ఫోన్లను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు బుధవారం పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలను మరింత పారదర్శకంగా, సాంకేతికతను జోడించి అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. నాతవరంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాతవరం, గొలుగొండ మండలాలకు చెందిన (ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని) 176 మంది అంగన్వాడీ టీచర్లకు అత్యాధునిక 5జీ స్మార్ట్ ఫోన్లను స్పీకర్ స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. అంగన్వాడీ సేవలను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల వివరాల నమోదు, ఫేస్ రికగ్నైజేషన్ విధానం ద్వారా మాత్రమే ఆహార పదార్థాల పంపిణీ, ఆరోగ్య పరీక్షల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయడానికి ఈ 5జీ ఫోన్లు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శ్రీగౌరి, తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, జనసేన పార్టీ నియోజవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ : యలమంచిలి పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే విజయ్ కుమార్ క్యాంపు కార్యాలయంలో బుధవారం అంగన్వాడి కార్యకర్తలకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు అంగన్వాడీ కేంద్రాలకు 258 మొబైల్ ఫోన్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజన శేషు, బొద్దపు శ్రీనివాసరావు, పూటకూటి రమేష్, కోటారు శ్రీను మాస్టర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా షర్మిల జన్మదిన వేడుకలు


మాడుగులలో కేక్ కట్ చేసేస్తున్న కొండలరావు, నర్స్


ప్రజాశక్తి -మాడుగుల:మాడుగులలో బుధవారం సెయింటన్స్ వృద్ధ శ్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త పడాల కొండలరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వృద్ధా శ్రమంలో కేకు కట్ చేసి పండ్లు రొట్టెలు పంచారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి నరసింగరావు పేట అంగన్వాడి కేంద్రంలో బుధవారం పిల్లల సమక్షంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదినోత్సవం కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మరెన్నో పుట్టిన రోజుల వేడుకలు జరుపుకోవాలని వారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి అసెంబ్లీ కోఆర్డినేటర్ మలపు రెడ్డి కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాళ్ళ సత్యనారాయణ, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు బి.బాల మురళి పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. డిసిసి ఇన్ఛార్జి అధ్యక్షులు అద్దాల వెంకట వర్మ రాజు (హసిని వర్మ రాజు) ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో వైఎస్ షర్మిల నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమలాకర్, కెవి.సూర్యనారాయణ, ప్రియాంక దండి, కస్తూరి వెంకటరావు, వజ్జిపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ సర్వేపై అవగాహన

ప్రజాశక్తి -మాడుగుల:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పై సచివాలయం సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఫ్యామిలీ నుంచి సుమారుగా 30 ప్రశ్నలకు పైగా సర్వే చేయాలన్నారు. ఈ సర్వే ద్వారా ప్రతి ఇంటికి కొత్త ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు ఇవ్వనున్నామన్నారు. భవిష్యత్తులో ఏ సంక్షేమ పథకం వర్తించాలన్నా ఈ కార్డుతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ అశోక్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న సచివాలయం సిబ్బంది

ధర్నాను జయప్రదం చేయాలి : యుటిఎఫ్


మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రభుత్వ నిరంకుశ, అణచివేత ధోరణిలను తామంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు యుటిఎఫ్ నాయకులు అన్నారు. యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు గారా రాజబాబు, ప్రధాన కార్యదర్శి కళింగ సతీష్, గౌరవ అధ్యక్షులు డి.ఆర్.కె.శాస్త్రి, సీనియర్ నాయకులు ఎస్.ఎ.ఎన్. రాజు మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18వ తేదీ గురువారం జిల్లా డీఈఓ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. టెట్ పరీక్ష మినహాయింపు, బోధనేతర కార్యక్రమాల రద్దు, సెలవు దినాల్లో పనిచేయమనడం, ఎస్ఎస్ సి యాక్షన్ ప్లాన్ అనే పేరుతో సెలవు దినాల్లో, పండుగ రోజుల్లో కూడా పనిచేయమనడం, ప్రతిరోజు టెస్ట్ పెట్టి వచ్చిన మార్కులను ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని ఒత్తిడి, సింగిల్ టీచర్ల సెలవులు, మెమో 57 అమలు, ఓ హెచ్ పాఠశాలలకు వర్తింపు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు.


మాట్లాడుతున్న దేవుడునాయుడు

ప్రయివేటీకరణ విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - చీడికాడ:ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపికి మార్చడం తగదని, తక్షణమే రద్దు చేయాలని సిఐటియు దేవుడు నాయుడు డిమాండ్ చేశారు. స్థానికులతో ఆయన బుధవారం నిరసన చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ వైద్య, విద్యా వ్యవస్థలను ప్రభుత్వం నడిపితేనే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. పి పి పి పద్ధతి అమలు చేస్తే విద్యా వ్యవస్థను ప్రైవేట్ వ్యక్తుల చేతులకి ఇచ్చినట్లేనన్నారు. విద్యా వ్యవస్థను ప్రైవేటుపరం చేస్తే అధిక ఫీజులు వసూలు చేస్తాయని, పేద మధ్య తరగతి విద్యార్థులు ఉన్నతమైన చదువులకి దూరమవుతారని తెలిపారు. విద్యా వ్యవస్థను ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచాలని, పిపిపి పద్ధతికి స్వస్తి పలకాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు వైద్య చదువులకు దూరం అవుతారని తెలిపారు. విద్యా వ్యవస్థ మెరుగుపడాలంటే పాఠశాలకు నిధులు మంజూరు చేసి మౌలిక సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

రూ.1.55 కోట్లతో ప్రతిపాదన

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం- కృష్ణదేవిపేట ప్రధాన రహదారిపై ఆరిలోవ అటవీ ప్రాంతంలో మిగిలిన మూడు మదుంలకు, ఆ ప్రాంతంలో ఉన్న రహదారి వెడల్పుకు రూ.1.55 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు ఆర్అండ్‌బీ ఏఇ ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు ఆరిలోవ అటవీ ప్రాంతంలో మిగిలిన మదుంల నిర్మాణానికి కొత్త ధరలకే అంచనా ప్రణాళికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించామన్నారు. మూడు మదుంలతో పాటు ఆ ప్రాంతంలో ఉన్న 200 మీటర్ల రోడ్డు గతంలో విస్తరించిన రోడ్డు మాదిరిగా విస్తరించడానికి అంచనా ప్రణాళిక తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. అనుమతులు మంజూరయిన వెంటనే టెండర్లకు ఆహ్వానిస్తామని ఆయన తెలిపారు.

సూర్యఘర్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి: రావికమతం: సూర్య గర్ పథకంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అనకాపల్లి ఎస్ఇ ప్రసాద్ కోరారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ స్టేషన్ వద్ద బుధవారం ఎంపీపీ పైల రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్య గర్ పథకంలో భాగంగా ప్రభుత్వం నుంచి 78 వేల రూపాయల సబ్సిడీ అందించడం జరుగు తుందన్నారు.

అథ్లెటిక్ పోటీల్లో రవి ప్రతాప్ ప్రతిభ

ప్రజాశక్తి-చీడికాడ: చీడికాడ మండలం బయలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎ.రవి ప్రతాప్ అథ్లెటిక్స్ పోటీలలో సత్తా చాటారు. ఆయన విలేకరులకు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈనెల 13,14వ తేదీలలో బాపట్ల సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో 100 మీటర్ల పరుగు, 110 మీటర్ల హర్డిల్స్, లాంగ్ జంప్ విభాగంలో పాల్గొని, మూడింటిలోనూ బంగారు పతకాలు సాధించారు. జనవరి నెలలో రాజస్థాన్ రాష్ట్రం అజ్మీరులో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. రవి ప్రతాప్ ని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు గ్రామస్తులు అభినందించారు.



సర్టిఫికెట్‌ను ఇస్తున్న నిర్వాహకులు



ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళన

ప్రజాశక్తి- నక్కపల్లి: ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ ప్లాంట్‌కు రెండవ విడత, అదేవిధంగా టౌన్ షిప్ ఏర్పాటు కోసం భూములు ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేశారు. భూసేకరణను వ్యతిరేకిస్తూ మండలంలోని నెల్లిపూడి, వేంపాడు, డిఎల్ పురం గ్రామాలకు చెందిన రైతులు బుధవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. వీరికి పలువురు నాయకులు సంఘీభావం తెలిపారు. స్టీల్ ప్లాంట్ కు రెండవ విడతలో 3800 ఎకరాలు, టౌన్ షిప్ కు 440 ఎకరాలు భూసేకరణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. తామంతా భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, కొబ్బరి, మామిడి, జీడి వంటి తోటల ఫల సాయంతో కుటుంబాలను పోషించు కుంటూ బతుకుతున్నామన్నారు. తమ జీవనాధారమైన భూములను తీసుకుంటే తామంతా ఎలా బతకాలని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చేది లేదని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. 2024, డిసెంబర్ 27న భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 76ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసిల్దార్ నరసింహా మూర్తికి వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, నాయకులు లొడగల చంద్రరావు, మణి రాము, గింజాల వెంకటరమణ, రాజేష్, గొర్ల బాబురావు, రైతులు టి.అప్పలరాజు, ఏ.రమేష్‌రాజు రైతులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు మెరుగైన సేవలను అందించాలని జిల్లా వ్యవసాయ సంచాలకులు (జేడీ) ఎం ఆశాదేవి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. మండలంలోని ఉద్దండ పురం లో బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పర్యటించారు. ప్రజా ప్రతినిధులు, రైతులతో మాట్లాడారు. వ్యవసాయ రంగం పై చర్చించారు. వ్యవసాయ శాఖ ద్వారా పొందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పాదకత పెంచుతూ రైతు తలసరి ఆదాయం పెంచేలా, వ్యవసాయం సాంకేతికత, మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బచ్చల రాజు, పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు పొడగట్ల పాపారావు, పలువురు నాయకులు, ఏఈఓలు సత్యనారాయణ, సాయి, వ్యవసాయ సహాయకులు ప్రశాంతి, రాజేష్ పాల్గొన్నారు.

అలరించిన శ్రామిక కళా సంబరాలు

-సిఐటియు అఖిల భారత మహాసభల నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి- గాజువాక : సిఐటియు అఖిలభారత మహాసభలను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రామిక కళాసంబరాలు పేరుతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. ముందుగా జనవిజ్ఞానవేదిక కడప జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు బాల బయన్న మూఢ నమ్మకాలను తొలగించేలా పలు ప్రదర్శనలు నిర్వహించారు. వాటిలో భాగంగా మహిళ తలపై మంట పెట్టి పాలను మరిగించడం, మంచినీళ్లతో దీపాలనువెలిగించడం, మండుతున్న మంటలను నోట్లో పెట్టడం, నేలమటిని వెలిగిస్తే మట్టిలోంచి మంటలు రావడం వంటి ప్రదర్శనలు చేశారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని, శాస్త్రీయదృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు, నృత్యప్రదర్శనలు ఆలోచింపజేశాయి. విసిసి ఆధ్వర్యంలో శివగిరికాలనీ, స్వతంత్ర్యనగర్, సుందరయ్యకాలనీ నుంచివచ్చిన చిన్నారులు సామాజిక చైతన్యాన్ని రగిలించేలా చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్వతంత్ర్యనగర్‌కు చెందిన ఐదో తరగతి చిన్నారి జాహ్నవి స్టేజిపై 12రకాల ఆసనాలు వేసి చూపించారు. ప్రజానాట్యమండలి, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రామిక కళాసంబరాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, ఎస్.జ్యోతీశ్వరరావు, ఎల్.బంగారునాయుడు, ఎ.లోకేశ్వరరావు, వై.సత్యవతి, సంతోషం, కిరీటం పాల్గొన్నారు. గాజువాక జంక్షన్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను పెద్దఎత్తున ప్రజలు తిలకించారు.



గీతాలు ఆలపిస్తున్న కళాకారులు



ప్రదర్శన చేస్తున్న బయన్న

21న కార్టూన్ పోటీలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిఐటియు అఖిలభారత మహాసభల సందర్భంగా ఈ నెల 27 నుండి జనవరి 2వ తేదీ వరకు నిర్వహించే శ్రామిక ఉత్సవ్‌లో కార్టూన్ల ప్రదర్శన ఉంటుందని, దీనికోసమై స్పాట్ కార్టూన్ల పోటీని ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు శ్రామిక ఉత్సవ్ కన్వీనర్ డాక్టర్ కె.రమాప్రభ తెలిపారు. ఈ పోటీలో 10 నుండి 80 సంవత్సరాల వయసుగల కార్టూనిస్టులందరూ పాల్గొనవచ్చని చెప్పారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముందే తెలిపిన టాపిక్‌ల మీద కార్టూన్ ఐడియాలు ఆలోచించుకుని వచ్చి నిర్వాహకులు ఇచ్చిన పేపర్ మీద ఎన్ని కార్టూన్లనైనా వేయవచ్చని తెలిపారు. 2 గంటల సమయంలోగా వేయాల్సి ఉంటుందని చెప్పారు. పోటీ అంశాలలో సృజనాత్మక వ్యంగ్యం తప్పకుండా ఉండాలన్నారు. శ్రామికుల డిజిటల్ యుగం సవాళ్లు, మహిళా శ్రామికుల సాధికారత, యువత ఉద్యోగాలు కలలు- వాస్తవాలు, గిగ్ ఎకానమీ- కార్మికులు, శ్రామిక యూనియన్లు కార్పొరేట్ కంపెనీలు, క్లైమేట్ చేంజ్- లేబర్ మార్కెట్‌పై ప్రభావం, ఆర్థిక అభివృద్ధిలో శ్రామికులు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, మత సామరస్యం-ఐక్యత అంశాలపై కార్టూన్లు వేయాలని తెలిపారు. పాల్గొనే వారందరికీ సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పారు. జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ కేటగిరీలలో వేసిన ఉత్తమ కార్టూన్లకు ఈ నెల 28వ తేదీన బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. బాగా సీనియర్ కార్టూనిస్టులు, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి రాలేని వారు ఈ టాపిక్‌లపై రెండు కార్టూన్లను వేసి ఇమెయిల్ ramadevikvizag@gmail.com కు పంపించ వచ్చని పేర్కొన్నారు. కార్టూన్లను ప్రదర్శనలో పెడతామన్నారు. ఎ 3 సైజ్‌లో కలర్‌లో జెపిజి ఫార్మాట్‌లో వేసి ఇమెయిల్ ద్వారా ఈ నెల 24వ తేదీలోగా పంపించాలన్నారు. మరిన్ని వివరాలకు 9866084124, 9247783307, 9492348428 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పి.వి.రామశర్మ, కె.రాంబాబు, మాధవి జగన్మోహన్, ఎస్.రజని, ఎం.రాహుల్, బాల బయన్న పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రమాప్రభ, తదితరులు

గోవాడ సుగర్స్‌లో వెంటనే క్రషింగ్ ప్రారంభించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో సహకార రంగంలో కొనసాగుతున్న గోవాడ చక్కెర కర్మాగారాన్ని మూసివేయడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికరిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు, నేడు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని తుంగలో తొక్కడం సరికాదన్నారు. లాభాల్లో నడిచిన సహకార కర్మాగారాన్ని నిర్వీర్యం చేసి మూసివేయాలని చూడడం పచ్చి దుర్మార్గమన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీపై ఆధారపడి 24 వేల మంది రైతులు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ రోజు ఆ రైతులను వదిలేసి, వారి చెరుకును శ్రీకాకుళం జిల్లా సంకిలి చక్కెర కర్మాగారానికి బలవంతంగా తరలించే పరిస్థితి తీసుకువచ్చారని, ఇది రైతులపై ప్రత్యక్ష దాడి తప్ప మరొకటి కాదని ఆందోళన వ్యక్తం చేశారు. మద్దతు ధర విషయంలోనూ రైతులకు తీవ్ర నష్టం కలుగుతోందన్నారు. గత ఏడాది గోవాడ ఫ్యాక్టరీ ద్వారా టన్నుకు రూ.3151 చెల్లించగా, ఈ ఏడాది సంకిలి యాజమాన్యం రవాణా ఖర్చులు మినహాయించి కేవలం రూ.2800 మాత్రమే, అది కూడా రెండు వారాలకు ఒకసారి చెల్లిస్తామని చెబుతోందని పేర్కొన్నారు. వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగిన ఈ సమయంలో ధర తగ్గించడం రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెడుతోందన్నారు. గోవాడ ఫ్యాక్టరీ తెరవకపోవడం వల్ల రైతులకు ప్రత్యామ్నాయం లేక సంకిలి యాజమాన్యం చెప్పిన ధరకే చెరుకును ఇవ్వాల్సిన పరిస్థితిని రాష్ట్ర కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని మండిపడ్డారు. మరోవైపు రైతులు, కార్మికులకు సుమారు 39 కోట్లు బకాయిలు చెల్లించాల్సి వుంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరించాలని, చెరుకు క్రషింగ్ ప్రారంభించాలని, రైతులకు, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం శ్రీఆదినారాయణ మహిళా కళాశాల (ఉమెన్స్ కాలేజీ)లో బుధవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ వారిచే ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే రామకృష్ణ ప్రారంభించారు. ఈ మెగా జాబ్ మేళా లో పదవ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగ అభ్యర్థులు 2130 మంది పాల్గొన్నారు. 3280 ఉద్యోగ అవకాశాలకు జరిగిన ఈ మేళాలో ఐటీ, ఆటోమొబైల్, టెలికాం, బ్యాంకింగ్, నవత ట్రాన్స్‌పోర్ట్, ఇన్స్టుమెంట్స్, ఎలక్ట్రానిక్స్, కెమికల్స్, ఏషియన్ పెయింట్, ఎంఆర్ఎఫ్ టైర్స్, జువెలరీ, లీలా హోండా, వరుణ్ మోటార్స్, బిగ్ బాస్కెట్‌తో సహా సుమారు 60 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన జాబ్ మేళాలో సుమారు 2130 యువతీ యువకులు పాల్గొనగా 1132 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పీకేపీ ప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గోవిందరావు, పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రామారావు ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : గుంటూరు జిల్లా పొలపర్రు, పెదనందిపాడు మండలంలో ఈనెల 13, 14 తేదీల్లో జరిగిన 45వ ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో అనకాపల్లి వాకర్స్ క్లబ్‌కు చెదిని ఎంప్టీ రామారావు ప్రతిభ చూపారు. 70 సంవత్సరాల విభాగంలో 1500, 400 మీటర్ల పరుగులో బంగారు పతకం, 5 కిలోమీటర్ల వాకింగ్, 100X4 రిలే మీటర్ల పురుషుల వ్యక్తిగత విభాగాల్లో రజితం పతకాలు గెలుచుకున్నారు. ఫిబ్రవరి 13 నుండి 15 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ క్రీడల్లో పాల్గొంటారని వాకర్స్ క్లబ్ అనకాపల్లి అధ్యక్షులు రాపేటి నారాయణ రావు తెలిపారు. రామారావును బుధవారం మార్కెట్ యార్డ్ నాగమ్మ గుడి వద్ద సాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రాపేటి నారాయణరావు, వై.శివ, కేవివి.సత్యనారాయణ, ఆడారి మల్లికార్జునరావు, డి.అప్పలనాయుడు, పి.వేణుగోపాలరావు, పి.నరసింహరావు, ఆడారి రామకృష్ణ, ఎస్.సన్యాసిరావు, పి.నూకేశ్వరరావు, బుద్ద ప్రకాశరావు, భీశెట్టి రామకృష్ణ, వేగి నాగు పాల్గొన్నారు.